క్లుప్తంగా

వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు

రుద్రవరం: వెలగలపల్లె పొలిమేరలో వెలసిన లక్ష్మీ,గోదా సమేత వాసాపురం వేంకటేశ్వర స్వామి, మహా త్రిపుర సుందరి సమేత మానస లింగేశ్వరస్వామి వారికి భక్తులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో అర్చకులు గోపీశర్మ, శివ ఉదయాన్నే స్వామి అమ్మవార్లకు నిత్య పూజలు గావించి ప్రత్యేకంగా అలంకరించారు. స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలి వచ్చిన భక్తాదులు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

బడిలో చేరిక



చిన్నారులను బడిలో చేర్పిస్తున్న దృశ్యం

దొర్నిపాడు: మండలంలోని అర్జునాపురం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఉంటున్న 8మంది చిన్నారులను స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రభాకరమ్మ ఒకటవ తరగతిలో చేర్పించారు. దీంతో ప్రధానోపాధ్యాయుడు రామచంద్రాడ్డి చిన్నారులకు అడ్మిషన్లు ఇచ్చి పుస్తకాలను అందజేశారు. అనంతరం గర్భిణులు, బాలింతలు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ముఖ్యంగా పోషక విలువలు కల్గిన ఆహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త అరుణకుమారి, ఏఎన్‌ఎం మల్లేశ్వరి పాల్గొన్నారు.

ముగిసిన ప్రవచనాలు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక కోటావీధిలో వెలసిన శ్రీరమా సమేత సత్యనారాయణ దేవస్థానంలో డాక్టర్ దీపీ హయగ్రీవాచారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పండరీ భాగవత ప్రవచనాలు శనివారం ముగిశాయి. ఆయన పండరీనాథుడి వైశిష్ఠం గురించి భక్తులకు వివరించారు. అనంతరం ఆలయ కార్యనిర్వాహకులు అయిన గోపాలయ్య, రామ్మూర్తి..కుటుంబ సభ్యులను ఆలయ చైర్మన్, ఈఓలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఈఓ నాగప్రసాద్, దేవస్థానం చైర్మన్ యాడికి శ్రీదేవి పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధ్యాత్మిక ప్రవచనాలు



కరపత్రాలను విడుదల చేస్తున్న నిర్వాహకులు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని మెయిన్ బజార్‌లో వెలసిన శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారిశాలలో ఈనెల 16 నుంచి నుండి 22వ తేదీ వరకు శ్రీ జ్ఞాన ప్రసాద్ గురూజీ ప్రవచనాలు వినిపిస్తారని నిర్వాహకులు తిమ్మయ్య, రామకృష్ణ తెలిపారు. శనివారం ఈ మేరకు ఆలయంలో కరపత్రాలను విడుదల చేశారు. ప్రవచనాలు 16వ తేదీ ఆదివారం సాయంత్రం 6 నుంచి 8గంటల వరకు సప్తాః జ్ఞాన యజ్ఞం ప్రవచనాలను వినిపిస్తారని, అలాగే 22వ తేదీ సాయంత్రం వరకు ప్రవచనాలు వినిపిస్తారని చెప్పారు.

క్రీడా భారతి ఆంధ్రప్రదేశ్ నూతన కమిటీ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన కమిటీ

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల జిల్లా క్రీడా భారతి ఆంధ్రప్రదేశ్ కమిటీని శనివారం రామకృష్ణారెడ్డి అధ్యక్షతన పరిశీలకులు సురేంద్రారెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా క్షేత్ర స్థాయి ప్రముఖ చంద్రశేఖర్ పాల్గొన్నారు. జిల్లా అధ్యక్షుడిగా శాంతినికేతన్ స్కూల్ చైర్మన్ సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా నిమ్మకాయల సుధాకర్‌తో పాటు ఉపాధ్యక్షులను ఎన్నుకున్నారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ దేశాన్ని ఒలంపిక్స్‌లో ముందుంచాలనే లక్ష్యంతో క్రీడా భారతి ఆవిర్భవించిందన్నారు. నంద్యాల జిల్లాలో క్రీడలకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. ఇక్కడి క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కూడా రాణించారని, నూతనంగా ఎన్నికైన సుధాకర్ అన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

చాగలమర్రి: స్థానిక నారాయణపల్లె రోడ్డులో ఉన్న ఇటుకల బట్టీ సమీప పొలాల్లో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై శనివారం దాడి చేసి మండల కేంద్రానికి చెందిన ఆరుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసి వారి నుంచి రూ.1800 నగదును స్వాధీనం పరచుకున్నట్లు ఎస్‌ఐ రమణయ్య తెలిపారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు చెప్పారు.

స్మార్ట్ టైం !

మిస్టర్ రవి.. ఉదయం ఆరు గంటలైంది.. త్వరగా లేవండి. మీ దినచర్యను ఎక్సర్‌సైజ్‌తో ప్రారంభించండి.. స్నానం చేసి ఓట్స్‌తో చేసిన టిఫిన్ తీసుకోండి.. కార్యాలయంలో కలవాల్సిన వ్యక్తులు, చేయాల్సిన పనులను వివరిస్తుంది ఓ గడియారం.. గతంలో గోడ గడియారం కేవలం సమయం చూపుతూ అలారం కొట్టేది. ప్రస్తుతం కాలం మారింది. స్మార్ట్ కాలంలో చేయాల్సిన దినచర్యను ముందుగా వాటిలో సెట్ చేసుకుంటే.. అవసరమైన సమయంలో గుర్తు చేస్తున్నాయి.

- స్మార్ట్ ఫోన్లు, వాచీల వైపు నవతరం
- కనుమరుగవుతున్న గోడ గడియారాలు,
- వాచీల మెకానిక్‌లకు ఉపాధి కరువు
- జిల్లాలో దాదాపు 800 షాపుల ద్వారా ఉపాధి



షాపులో ఉంచిన గోడ గడియారాలు

నంద్యాల(అర్బన్): సాంకేతిక పరిజ్ఞానం కొత్త పుంతలు తొక్కుతుండటంతో మార్కెట్‌లో పాత వాటికి గిరాకీ తగ్గుతోంది. మన అవసరాలు తీరుస్తూ ఎంతగానో ఉపయోగపడిన వస్తువులు మారుతున్న కాలానికి అనుగుణంగా కనుమరుగవుతున్నాయి. వాటి స్థానంలో మరొకటి వచ్చి చేరుతోంది. ఇందుకు చక్కటి ఉదాహరణ గోడ గడియారాలు, చేతి వాచ్‌లు. ఒకప్పుడు టైం చూసుకోవాలంటే ఇవే ఆధారం. వాటికి మంచి ఆదరణ ఉండడంతో ప్రతి సెంటర్‌లో దుకాణాలుండేవి. సంబంధిత మెకానిక్‌లకు కూడా చేతి నిండా పని ఉండేది. కాలక్రమేణా మొబైల్‌ఫోన్లు, స్మార్ట్‌వాచ్‌ల రాకతో వాటి వినియోగం బాగా తగ్గిపోయింది. గడియారాల దుకాణాల స్థానంలో మొబైల్‌ఫోన్ల దుకాణాలు వెలిశాయి. మెకానిక్‌లకు పని కరువవడంతో వారి జీవనం దుర్భరంగా మారింది. దీంతో వాటిపై ఆధారపడిన వారు ఉపాధి కోల్పోవాల్సి వస్తోంది. కొన్నేళ్ల క్రితం వాచీల వాడకం ఎక్కువగా ఉండేది. రకరకాల వాచీలు మార్కెట్లో లభించేవి. దీంతో వాటిని రిపేర్ చేసేవారు వీధికొకరు దర్శనమిచ్చేవారు. ఇప్పటి ఎలక్ట్రానిక్ గడియారాలు ఐదేళ్లకు మించి పని చేసే పరిస్థితి లేదు. ఇవి ఎక్కువ రిపేర్లకు కూడా సహకరించవు. గతంలో రిపేర్లు వస్తే ఓవరాయిల్ చేస్తే సరిపోయేది. కీరాడ్స్, వాచ్ గ్లాసులు, ముళ్లు ఎక్కువగా రిపేరీకి వస్తుండేవి. ఇప్పటి ఎలక్ట్రానిక్ వాచ్‌లకు బ్యాటరీలు మార్చుకుంటే సరిపోతుంది. ఇవి యూజ్ అండ్ త్రో లెక్కనే పనిచేస్తుండడంతో వాచీలు రిపేరీ చేసేవారికి పనిలేకుండా పోయింది. ప్రస్తుతం వాచీలు రిపేరు చేసేవారు పట్టణాల్లో షాపుల ముందు చిన్న చెక్కబల్లలు పెట్టుకొని పనిచేస్తున్నారు. ఇలా నంద్యాల జిల్లాలో 800 షాపుల ద్వారా ఉపాధి పొందుతున్నారు. ఒకప్పుడు ఉదయాన్నే నిద్రలేవడానికి గడియారంలో అలారం పెట్టుకునేవారు. ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. సెల్‌ఫోన్‌లోనే సర్వం అందుబాటులో ఉన్నాయి. తేదీ, సమయంతో పాటు అలారం సౌకర్యం ఇస్తుండడంతో గడియారం అవసరమే లేకుండా పోయింది. అలాగే.. స్మార్ట్ అలారమ్ గడియారాలు రావడం, వాటిలో వాయిస్ ఆధారిత సేవలు అందుబాటులో ఉండటం, కేవలం అలారం, సమయం మాత్రమే కాకుండా ఆ రోజు చేయాల్సిన కార్యక్రమాలు, కృత్యాలపై ముందస్తుగా సమాచారం ఇస్తుండటం, వాయిస్‌తో ఆ వాచ్ నుంచే ఇంట్లోని పలు పరికరాలు సేవలందించేలా ఏర్పాట్లు ఉంటున్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో అలెక్సా, సిరి, గూగుల్ వాయిస్ బేస్డ్ పరికరాలకు డిమాండ్ ఉంది. వీటితో సమయం తెలియజేయడంతో పాటు చేయాల్సిన పనులు, ఇంట్లోని వివిధ రకాల ఎలక్ట్రానిక్ వస్తులను ఆపరేట్ చేయవచ్చు.

40 ఏళ్లుగా ఈ వృత్తే ఆధారం



ఒకప్పుడు వాచ్ రిపేరు మెకానిక్‌ను వాచ్ మాస్టర్ అని ఎంతో ఆప్యాయంగా పలకరించేవారు. 40 ఏళ్లుగా గడియారాల రిపేరీ వృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్నా. అలవాటైన వృత్తి కాబట్టే వదల్లేకపోతున్నా. ప్రస్తుతం స్మార్ట్ ఫోన్ యుగం నడుస్తోంది. దీంతో గడియారాలకు ఆదరణ కరువైంది.

– బాషా, వాచ్ మెకానిక్, నంద్యాల



స్మార్ట్ అలారం గడియారం



స్మార్ట్ వాచ్



వాయిస్ కమాండ్‌తో పనిచేసే పరికరాలు

మంత్రి ఫరూక్‌కు అభినందనలు



మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న జిల్లా కలెక్టర్,ఎస్పీ



జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి

నంద్యాల: ముస్లిం మైనార్టీ సంక్షేమ, న్యాయశాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్‌కు అధికారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు. మంత్రిగా ప్రమాణస్వీకారం చేసి నంద్యాలకు వచ్చిన ఫరూక్‌ను శనివారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో పలువురు అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు, ఎస్పీ రఘువీర్‌రెడ్డి, జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డితో పాటు పలువురు అధికారులు కలిశారు. అలాగే నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరికి సైతం ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు, జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి, ఎస్పీ రఘువీర్‌రెడ్డిని ఎంపీ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అధికారులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించాలి



మల్లేవేములలో చిన్నారికి సర్టిఫికెట్ అందజేస్తున్న సీడీపీఓ తేజేశ్వరి

చాగలమర్రి: మూడేళ్లు పూర్తి చేసుకున్న చిన్నారులను సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని, అలాగే ఐదేళ్లు నిండిన పిల్లలను ప్రభుత్వ ప్రీ ప్రాథమిక పాఠశాలలో అడ్మిషన్ చేయించాలని ఐసీడీఎస్ సీడీపీఓ తేజేశ్వరి తెలిపారు. శనివారం అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమంలో భాగంగా మల్లెవేముల గ్రామంలో అంగన్‌వాడీ సిబ్బంది, చిన్నారులు, తల్లులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంగన్‌వాడీ గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించి ఐదేళ్లు పూర్తి చేసుకున్న చిన్నారులకు కాన్వొకేషన్ నిర్వహించిన ప్రీ ప్రైమరీ పాఠశాలలో చేరేందుకు సర్టిఫికెట్లు అందజేశారు. సుపర్‌వైజర్ సుశీలమ్మ, ప్రధానోపాధ్యాయురాలు మాధవి, అంగన్‌వాడీ కార్యకర్తలు పద్మావతి, రెహెనా, హసీనా, వాహీదా, రజిని, ఇందుమతి, సుజాత, లక్షుమమ్మ, సరోజమ్మ, శోభారాణి పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప జన్మనక్షత్ర పూజలు



అయ్యప్ప స్వామికి అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: స్వామియే శరణం అయ్యప్ప .. అనే శరణుఘోషతో పట్టణ శివారులోని అయ్యప్ప ఆలయ నిర్మాణం ప్రాంతం మార్మోగింది. పట్టణ శివారులోని కాచింతల సమీపంలోని ఉత్తర శబరిమల అయ్యప్ప స్వామి ఆలయంలో శనివారం స్వామి జన్మ నక్షత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేకువజామునే మూలమూర్తికి అష్టద్రవ్య ఫల అభిషేకం, అర్చనలు చేసి నూతన పట్టు వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించారు. పూజల అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.


తల్లిదండ్రుల ఆకాంక్ష నెరవేర్చాలి



డాక్టర్ వి.జయలక్ష్మిని సత్కరిస్తున్న ఈఓ, ప్రొఫెసర్లు

మహానంది: తాము పడిన కష్టాలు పిల్లలు పడొద్దని తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదివిస్తారని, వారి ఆకాంక్షను నెరవేర్చాలని మహానంది ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మహానంది సమీపంలోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ కళాశాలలో శనివారం రాత్రి హాస్టల్ డే నిర్వహించారు. ఈఓ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో కాలానికి అనుగుణంగా విద్యార్థులు కష్టపడి చదవాలన్నారు. వ్యవసాయ రంగంలో వస్తున్న విప్లవాత్మకమైన మార్పులకు అనుగుణంగా నూతన వంగడాలపై దృష్టి సారించాలని సూచించారు. వేడుకల్లో విద్యార్థినీ, విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మహానంది వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి.జయలక్ష్మి, రిటైర్డ్ ఏడీ నరసింహరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


కేసీలో గుర్రపుడెక్క



కేసీలో పరుచుకుపోయిన గుర్రపు డెక్క

పగిడ్యాల: సుంకేసుల రిజర్వాయర్‌కు వరద నీరు వచ్చి చేరడంతో రెండు నెలలుగా ఒట్టిపోయిన కేసీ కాలువకు నీటిపారుదల శాఖ అధికారులు వెయ్యి క్యూసెక్కుల నీటిని పశువుల దాహార్తి కోసం విడుదల చేశారు. అయితే ముచ్చుమర్రి గ్రామం వద్ద కేసీలోని క్రాస్ రెగ్యులేటర్‌లను మూయడం వల్ల ఎగువ నుంచి కొట్టుకువచ్చిన గుర్రపు డెక్క 200 మీటర్ల మేరకు పేరుకుపోయింది. క్రాస్ రెగ్యులేటర్‌ల వద్ద నిలిచిన గుర్రపు డెక్క ప్రమాదకరంగా మారింది.

మొలకెత్తిన ఆశలు



దొర్నిపాడు శివారులో మొలకెత్తిన మినుము పైరు

దొర్నిపాడు: ఖరీఫ్ సాగులో భాగంగా మండలంలోని రైతులు మినుము పంటను ఏటా విస్తారంగా సాగుచేస్తారు. ప్రస్తుతం తొలకరి పలకరించడంతో మినుము పంట సాగు చేశారు. అంతేగాక ఈసారి వర్షాలు అనుకూలంగా ఉన్నాయని వాతావరణ శాఖ తీపి కబురు చెప్పడంతో రైతులు ముందస్తు పంటకు శ్రీకారం చుట్టారు. కురిసిన వర్షాలకు మినుము మొలకెత్తి రైతన్న ఆశలకు ఊపిరిపోస్తుంది. మినుములు కూడా క్వింటా రూ.10వేలకు పైగా ధర ఉండటంతో రైతులు సాగు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. ఒక వేళ పంట చేతికి రాకపోయినా వెంటనే పంటను పచ్చిరొట్ట ఎరువుగా మార్చి వరి నాటుకోవచ్చని రైతులు పేర్కొంటున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

చాగలమర్రి: మలేరియా, డెంగీ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటమ్మ తెలిపారు. శనివారం మలేరియా వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా పట్టణంలోని 16వ వార్డు బాబాపక్రుద్దీన్ లాడ్జి ఏరియాలో ర్యాలీ నిర్వహించి, అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి మలేరియా నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే దోమలు కుట్టకుండా దోమతెరలు వినియోగించాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, మురుగు నీరు నిల్వ ఉంటే ఆ నీటి తొలగించి వేస్ట్ ఆయిల్ వేయాలని చెప్పారు. ఆరోగ్య కార్యకర్త మాధవి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

రుద్రవరం: స్థానిక చంద్రునిపేటకు చెందిన చరణ్ అనే యువకుడు శనివారం ఆయుర్వేద మాత్రలు 30 మింగి ఆత్మహత్యకు యత్నించాడు. కాలనీ వాసులు తెలిపిన వివరాల మేరకు ఇంటి విషయంలో తండ్రి మందలించడంతో మనస్థాపానికి గురై అధిక సంఖ్యలో మాత్రలు మింగి అస్వస్థతకు గురయ్యాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించారు. మెరుగైన చికిత్స కోసం 108 వాహనంలో నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

మాన్యం కౌలుకు వేలం

రుద్రవరం: మండలంలోని పెద్దకంబలూరు గ్రామ ఆంజనేయ స్వామి ఆలయ భూముల కౌలుకు శనివారం దేవదాయశాఖ అధికారులు వేలం నిర్వహించారు. 22.96 ఎకరాలకు వేలం నిర్వహించగా రూ.3.58 లక్షలు వచ్చిందని, గతేడాది రూ.3.08 లభించిందని కోటపాడు గ్రూపు దేవస్థానాల ఈఓ వేణునాథరెడ్డి తెలిపారు. ఈ ఏడాది రూ.50వేల ఆదాయం సమకూరిందని చెప్పారు.

అనుమతులు లేని జంతువధ నిషేధం

నంద్యాల(సిటీ): పట్టణంలో అనుమతులు లేని జంతు వధ నిషేధమని మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో రోడ్లపై, ఇళ్ల వద్ద, అనుమతి లేని జంతు వధశాలల్లో మాంసం విక్రయించడం చట్టరీత్యా నేరమన్నారు. వ్యాపారులు ప్రభుత్వ నిబంధనల మేరకు, పశు వైద్యులు ధృవీకరించిన జంతువులను మాత్రమే మాంసం కోసం వధించాలని సూచించారు. లైసెన్స్ పొందిన జంతు వధ శాలల్లో మాత్రమే మాంసం విక్రయాలు నిర్వహించాలని పేర్కొన్నారు.

శాస్త్రోక్తంగా అష్టబంధన మహాసంప్రోక్షణ హోమం



అష్టబంధన మహాసంప్రోక్షణ హోమం నిర్వహిస్తున్న దృశ్యం



ఉత్సవమూర్తులకు పూజలు నిర్వహిస్తున్న పండితులు

ఆళ్లగడ్డ: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అహోబిలం ఆలయంలో అష్టబంధన బాలలయ మహా సంప్రోక్షణ శనివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. దిగువ అహోబిలంలో వెలిసిన శ్రీ ప్రహ్లాదవరదస్వామి దేవాలయంలో జూలై 3 నుంచి 7వ తేదీ వరకు జీర్ణోద్ధరణ అష్టబంధన మహా సంప్రోక్షణ కార్యక్రమం నిర్వహించనున్నారు. అందులో భాగంగా శనివారం నుంచి ఆదివారం వరకు బాలలయ కళావర్షణం నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో మూలమూర్తి దర్శనం ఉండదు. భక్తులు ఉత్సవమూర్తులను దర్శించుకోవాలి. ఇందులో భాగంగా ఉత్సవమూర్తులను ఆలయ ప్రాంగణములోని యాగశాలలో కొలువుంచి నవకళశ స్థాపన, పంచామృతాలతో అభిషేకించి పట్టువస్త్రాలతో అలకరించి కొలువుంచారు. అనంతరం అష్టబంధన మహాసంప్రోక్షణ హోమం జరిపించారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యతనివ్వండి

నంద్యాల(అర్బన్): బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఉమ్మడి కర్నూలు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి సునిల్ ఖన్నా శనివారం ఒక ప్రకటనలో కోరారు. కరోనా వైరస్ వ్యాప్తి నిరోధానికి ఈద్గాల్లో, నమాజ్‌ల సమయంలో ఈద్గా కమిటీలు, ముతవల్లులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మసీదు ఫ్లోరింగ్, టాయిలెట్లను తరచూ శుభ్రం చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ ఫేస్ మాస్క్ ధరించి సామాజిక దూరం పాటించాలన్నారు. మసీదుల ప్రవేశ ద్వారం వద్ద శానిటైజర్స్‌ను ఏర్పాటు చేయాలని కోరారు.



వంకల్లో ప్రవహిస్తున్న వర్షపు నీరు, పొలాల్లో పెరుగుతున్న గడ్డి

బీళ్లవుతున్నాయి

దొర్నిపాడు: వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు పొలాల్లో తడి ఆరలేదు. దీంతో విత్తం వేసినట్లుగా పచ్చని గడ్డి మొలకెత్తి పొలాలన్నీ బీళ్లవుతున్నాయి. ఇప్పటికే రైతులు రెండుసార్లు ఒట్టి సేద్యాలు చేశారు. ప్రస్తుతం వర్షం విరామం ఇస్తే మళ్లీ సేద్యం చేసుకోవాలని ఎదురు చూస్తున్నారు. రోజులో ఏదో ఒక సమయంలో పది నిమిషాలైనా వర్షం కురుస్తుంది. దీంతో వాగులు వంకలు ఇంకా ప్రవహిస్తూనే ఉన్నాయి.

నాడు-నేడు పనులు ప్రారంభం



వరండా నిర్మాణానికి గుంతలు తవ్వుతున్న కూలీలు

రుద్రవరం: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో అసంపూర్తిగా నిలిచిన నాడు–నేడు పనులు తిరిగి ప్రారంభమయ్యాయి. ఆ పనులన్నీ పూర్తయితేనే విద్యార్థులకు మెరుగైన వసతులు అందుబాటులో ఉంటాయని ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు ముందుకు కదిలారు. ఇందులో భాగంగానే మండలంలోని డీ.కొట్టాలలో హెచ్‌ఎం వెంకటేశ్వర్లు శనివారం వరండా నిర్మాణ పనులు ప్రారంభింప చేయించారు. ఆ పాఠశాలకు గత ప్రభుత్వం రూ.10 లక్షలు మంజూరు చేసింది. వాటితో కొన్ని పనులు చేయించి అర్ధాంతరంగా నిలిపేశారు. పాఠశాలకు రెండే గదులు ఉన్నాయి. వాటిల్లో తరగతులు నిర్వహిస్తే మధ్యాహ్న సమయంలో భోజనం తినేందుకు వసతిలేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను పరిష్కరించేందుకు హెచ్‌ఎం వరండా నిర్మాణ పనులను చేపట్టారు.

కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలి



జేసీకి వినతి పత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): కార్మికులపై రాజకీయ వేధింపులు ఆపి వేతనాలు పెంచి వారి సంక్షేమానికి కృషి చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సుంకయ్య, నాయకుడు శ్రీనివాసులు కోరారు. ఈ మేరకు శనివారం జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డిని కలిసి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు పెంచాలని, వారికి రక్షణ కల్పించాలన్నారు. నంద్యాల జిల్లాలో వేధింపులు అధికమయ్యాయని, ఉద్యోగాల నుంచి అక్రమంగా తొలగిస్తూ దౌర్జన్యం చేస్తున్నారన్నారు.